సాక్షి
పెద్దపల్లి
7
గురువారం । 17 । అక్టోబర్ । 2024

ఆకట్టుకున్న అలయ్.. బలయ్



గోదావరిఖని: నగరంలో బుధవారం నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమం ఆకట్టుకుంది. బీజేపీ నాయకుడు క్యాతం వెంకటరమణ అధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, నాయకులు కందుల పోచం, హన్మంతుగౌడ్, కోడూరి రమేశ్, బొంకూరి మధు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. తలకాయ కోర్మా, రాగి సంకటి, జొన్నగడ్క, మక్కగడ్క, జొన్న రొట్టె, బబ్బెర గారెలు, పెసర గారెలు, జొన్న అంబలి, రాగిజావ, చల్ల, బబబ్బెర గుడాలు, శెనిగ గుడాలు నోరూరించాయి.

న్యూస్‌రీల్

నేడు 'ఎన్నీల ముచ్చట్లు'

పెద్దపల్లిరూరల్: కలెక్టరేట్‌లో ఈనెల 17న (గురువారం) ఎన్నీల ముచ్చట్లు సాహిత్య కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలంగాణ రచయితల వేదిక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుమార్, శంకరయ్య బుధవారం తెలిపారు. దశాబ్ద కాలంగా కరీంనగర్‌లో ప్రతీపౌర్ణమి నాడు కొనసాగే ఎన్నీల ముచ్చట్లు కార్యక్రమాన్ని ఈసారి పెద్దపల్లిలో చేపట్టామని రచయితలు రవీందర్, వెంకటేశ్ వివరించారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే వారు సింగిల్‌పేజీ కథలతో గురువారం సాయంత్రం 6.30గంటలకు రావాలని వారు కోరారు.

రైతులకు సకాలంలో యూరియా సరఫరా



మాట్లాడుతున్న సీజీఎం ఉదయ్ రాజహంస

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రైతులకు సకాలంలో యూరియా అందించడమే లక్ష్యమని ఆర్‌ఎఫ్‌సీఎల్ సీజీఎం ఉదయ్ రాజహంస తెలిపారు. హైదరాబాద్ రాజ్‌భవన్‌లో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలతో గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్‌ఎఫ్‌సీఎల్ సీజీఎం ఉదయ్ రాజహంస పాల్గొని మాట్లాడారు. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా కేంద్రప్రభుత్వం ఆర్‌ఎఫ్‌సీఎల్‌ను ప్రారంభించిందన్నారు. పంటలకు అవసరమైన యూరియాను సకాలంలో సరఫరా చేయడంలో రామగుండం ఎరువుల కర్మాగారం ముఖ్య పాత్ర పోస్తుందని ఆయన తెలిపారు.

కార్మికులకు పదోన్నతి



కార్మికుడిని సన్మానిస్తున్న ప్రతినిధులు

పాలకుర్తి(రామగుండం): బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలోని 18 మంది కాంట్రాక్ట్ కార్మికులకు బుధవారం బేసిక్ కార్మికులుగా పదోన్నతి లభించింది. ఈమేరకు యాజమాన్యం ఉత్తర్వులు జారీచేసింది. పదోన్నతి పొందిన కార్మికులకు అధికారులు నియామకపత్రాలు అందజేశారని నాయకులు తెలిపారు. కాగా, డెయిరీ విభాగంలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన కార్మికుడు బసవరాజును కార్మిక సంఘం నాయకులు, అధికారులు సన్మానించారు. కాంట్రాక్ట్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్, సివిల్ మేనేజర్ రాజేందర్, హెచ్‌ఆర్ అధికారి సదానందం, డెయిరీ ఫామ్ ఇన్‌చార్జి భరత్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన పత్తికే 'మద్దతు'

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని సీసీఐ కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన పత్తి తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం పత్తి కొనుగోళ్లపై అధికారులతో సమీక్షించారు. 8శాతం తేమ ఉన్న పత్తి క్వింటాలుకు సీసీఐ కేంద్రాల్లో రూ.7,521 మద్దతు ధర చెల్లిస్తారని అదనపు కలెక్టర్ అన్నారు. జిన్నింగ్ మిల్లుల్లోని సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోలు ప్రారంభమైందని ఆయన తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. డీఎం ప్రవీణ్‌రెడ్డి, డీఏవో ఆదిరెడ్డి, డీటీవో రంగారావు, తూనికలు, కొలతల శాఖ అధికారి విశ్వేశ్వర్, మార్కెట్ కార్యదర్శులు, సీసీఐ అధికారులు, జిన్నింగ్ మిల్లు యజమానులు, అడ్తిదారులు తదితరులు పాల్గొన్నారు.

నలుగురు సీఐల బదిలీ

గోదావరిఖని: రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో నలుగురు సీఐలను బదిలీ చేస్తూ మల్టీజోన్–1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఐటీ సెల్‌లో పనిచేస్తున్న ఎస్.ప్రమోద్‌రావును మంచిర్యాల పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేశారు. మంచిర్యాల పోలీసుస్టేషన్‌లో ఎస్‌హెచ్‌వోగా పనిచేస్తున్న బన్సీలాల్‌ను మల్టీజోన్ వన్ ఐజీకి అటాచ్ చేశారు. సీసీఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లాలో పనిచేస్తున్న డి.వేణుచందర్‌ను శ్రీరాంపూర్ సీఐగా బదిలీ చేశారు. శ్రీరాంపూర్ సీఐగా పనిచేస్తున్న దబ్బేట మోహన్‌ను మల్టీజోన్ వన్ ఐజీకి అటాచ్ చేశారు.

గడువు పొడిగింపు

గోదావరిఖనిటౌన్: కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్యలో డిగ్రీ, పీజీ, డిప్లొమా, లైబ్రరీ సైన్స్, మాస్టర్ ఆఫ్ జర్నలిజం, హెచ్‌ఆర్‌ఎం, సైకాలజీ, డిప్లొమా ఇన్ కంప్యూటర్స్, యోగా, పీజీలో సైన్స్ కోర్సుల్లో ప్రవేశాలకు అక్టోబర్ 30వ తేదీ వరకు గడువు పొడించారు. అర్హులైన అభ్యర్థులు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ రామచంద్రం తెలిపారు. మంచిర్యాల, లక్సెట్టిపేట, శ్రీరాంపూర్, మందమర్రి, పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని ప్రాంతాల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, 8341385000లో సంప్రదించాలని సూచించారు.

కాటికి కష్టాలు

హిందూ శ్మశానవాటికలో అనేక సమస్యలు

గోదావరి నదీతీరంలోని హిందూ శ్మశానవాటికలో ఖాళీ స్థలం కరువైంది. ఒక గొయ్యి తవ్వితే మూడుకు మించి అస్థిపంజరాలు బయటపడుతున్నాయి. గ్యాసిఫికేషన్ కోసం యంత్రసామగ్రి సిద్ధంగా ఉన్నా.. సాంకేతిక కారణాలు చూపుతూ వాటిని వినియోగంలోకి తీసుకు రావడం లేదు. గద్దెలు(ప్లాట్‌ఫామ్స్) సరిపోక శవాల దహనానికీ నిరీక్షణ తప్పడంలేదు. కుటుంబ సభ్యులను పోగొట్టుకుని పుట్టెడు దుఃఖంలో ఉన్నవారిని అంత్యక్రియల నిర్వహణ అంతకు మించి విషాదంలోకి నెడుతోంది.



సమస్యలకు నిలయమైన గోదావరి తీరం ఇంటెక్‌వెల్ సమీపంలోని హిందూ శ్మశానవాటిక

- ఒక్కో గొయ్యిలో మూడు అస్థిపంజరాలు
- మృతదేహాల ఖననానికి ఖాళీస్థలం కరువు
- వినియోగంలోకి రాని గ్యాసిఫికేషన్ సెంటర్
- శ్మశానవాటిలో శిథిలమైన అంతర్గత రహదారులు
- రూపాయికే అంత్యక్రియలకు బల్దియా రాంరాం

సాక్షి పోలీసు సాక్షి



శ్మశానంలో శిథిలమైన సీసీరోడ్డు

గోదావరిఖని: ఏటా వర్షాకాలంలో వరద, బ్యాక్‌వాటర్ శ్మశానవాటికను ముంచెత్తుతోంది. ఫలితంగా రోడ్లు శిథిలమవుతున్నాయి. పాడె మోసుకుంటూ వెళ్లేందుకు నరకం అనుభవించాల్సి వస్తోంది. అంత్యక్రియలే కాదు.. ఖర్మకాండలు చేసేందుకూ స్థలం కరువైంది. స్నాన ఘట్టాలు నిర్మించలేదు. నదిలోకి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం కూడా లేదు.

రోజూ 3– 7 మృతదేహాలు..

హిందూ శ్మశానవాటికకు ప్రతీరోజు 3– 7 వరకు మృతదేహాలను అంత్యక్రియల కోసం తీసుకొస్తున్నారు. ఒక్కో మృతదేహం తాలూకు బంధువులు కనీసం వంద వరకు ఇక్కడకు వస్తున్నారు. అంటే.. రోజూ దాదాపు 500 మంది వరకు శ్మశానవాటికకు వస్తున్నారు. వారు సేదతీరేందుకు కనీస సౌకర్యాలు లేవు. ఇప్పటికే పెరిగిన చెట్లను నరికివేయడంతో నీడ సౌకర్యం లేకుండాపోయింది.

గోదావరి చెంతనే ఉన్నా..

అంత్యక్రియలు, ఖర్మకాండలకు పెద్దసంఖ్యలో బంధువులు, కుటుంబసభ్యులు శ్మశానవాటికకు వస్తున్నారు. పక్కనే గోదావరి నది ఉన్నా.. వారు తాగేందుకు స్వచ్ఛమైన నీరు లభించడంలేదు. ఫలితంగా మినరల్ వాటర్ కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. సుమారు రెండు కిలోమీటర్ల దూరంలోని గంగానగర్‌లో మినరల్ వాటర్ కొనుగోలు చేసి తీసుకెళ్లకుంటే దాహంతో తపించి పోవాల్సిందే.

రూ.90 లక్షలు వెచ్చించినా..

ఎలక్ట్రిక్, గ్యాస్‌ఫికేషన్‌తో దహన సంస్కారాల నిర్వహణకు ప్రత్యేక యంత్రాన్ని రూ.60 లక్షలతో బల్దియా అధికారులు కొనుగోలు చేశారు. ఇందుకోసం రూ.30 లక్షలు వెచ్చించి భవనం నిర్మించారు. మొత్తం రూ.90 లక్షలు వెచ్చించినా ఆ ప్రక్రియను ప్రారంభించడంలేదు.

రూపాయికే అంత్యక్రియలు ఎప్పుడో?

రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో చనిపోయిన వ్యక్తి ఆధార్ నంబరుతో బుక్ చేస్తే.. దహన సంస్కారాలకు అవసరమైన కర్ర, లేదా గొయ్యి తీసేందుకు రూపాయికే అంత్యక్రియలు పథకాన్ని 2019లో ప్రారంభించారు. ఈఏడాది ఏప్రిల్ వరకు ఇది కొనసాగింది. ఆ తర్వాత నిధుల లేమితో దానిని నిలిపివేశారు. ఇప్పటికే సుమారు రూ.25లక్షల వరకు బకాయిలు రావాల్సి ఉందని శ్మశానవాటికలోని కార్మికులు చెబుతున్నారు. వీటి కోసం బల్దియా కార్యాలయం ఎదుట డప్పు కొట్టి నిరసన తెలిపారు. దీంతో ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాకూర్ జోక్యంతో రూ.12లక్షల వరకు చెల్లించారు.



పాములకు నిలయంగా మారిన ఖాళీ స్థలం



నిరుపయోగంగా గ్యాసిఫికేషన్ సెంటర్

రూపాయికే అంత్యక్రియలు ఏవి?



ఆఖరి మజిలీ కోసం ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. రూపాయికే అంత్యక్రియల పథకం ఎత్తివేయడంతో ఒక్కో కుటుంబంపై రూ.15వేల – రూ.40వేల వరకు ఆర్థిక భారం పడుతోంది. ఇది పేదలకు పెనుభారంగా మారుతోంది. రాత్రిపూట శ్మశానంలోకి వెళ్లడం భయంగా ఉంటోంది.

– మద్దెల దినేశ్, సామాజికవేత్త

రూ.25 లక్షలు రావాలి



రూపాయికే అంత్యక్రియల పథకం కింద మేము కట్టెలు సమకూర్చినం. గొయ్యిలు తవ్వినం. ఆ బిల్లులు రూ.25 లక్షల వరకు మాకు రావాల్సి ఉంది. బల్దియా ఆఫీస్ ముందు డప్పు కొట్టి నిరసన తెలిపినం. రూ.12 లక్షల ఇచ్చిండ్రు. ఇంకా రూ.25 లక్షలు రావాల్సి ఉంది. అవి ఎప్పుడిస్తరో తెల్వకుంట ఉంది.

– డప్పు రమేశ్, డప్పు కళాకారుల సంఘం నేత

డబ్బులు గుంజుతున్నరు



మా బంధువొకరు గతనెలలో చనిపోయారు. అంత్యక్రియల కోసం రూ.18వేల – రూ.20వేలు వసూలు చేసిండ్రు. ఇదేమిటంటే.. డప్పులు, కర్ర, బొంద తవ్వడమనే పేర్లు చెప్పిండ్రు. స్నానం చేసే ప్రాంతంలో పాకురుపై జారిపడి మహిళ తలకు గాయాలైనయి. ఎమ్మెల్యే జోక్యం చేసుకోవాలి.

– అనవేన పృథ్వీ, ఉదయ్‌నగర్, గోదావరిఖని

అభివృద్ధి చేస్తాం



శ్మశానవాటికలోని సీసీ రోడ్డును నెలరోజుల్లోగా అభివృద్ధి చేస్తాం. ప్రహరీ, టాయిలెట్లు నిర్మిస్తాం. బ్యాక్ వాటర్ ముప్పును తప్పించేందుకు రిటర్నింగ్ వాల్ నిర్మించాల్సి ఉంది. ఎలక్ట్రిక్ క్రిమీటేయర్‌ను వినియోగంలోకి తీసుకొస్తాం. శ్మశానంలో గ్రీనరీ ఏర్పాటు చేసి అందంగా తీర్చిద్దుతాం.

– శివానంద్, ఈఈ, రామగుండం బల్దియా

ఓదెల మల్లన్నకు మొక్కులు



పట్నాలు వేస్తున్న భక్తులు

ఓదెల(పెద్దపల్లి): ఓదెల మల్లికార్జునస్వామి సన్నిధిలో బుధవారం భక్తుల రద్దీ నెలకొంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలుప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు.. తొలుత కోనేటిలో స్నానాలు ఆచరించారు. మల్లికార్జునస్వామి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం మల్లికార్జునస్వామి, శ్రీసీతారామచంద్రస్వామి, నందీశ్వరులను దర్శనం చేసుకున్నారు. ఒగ్గుపూజారులతో స్వామివారికి పట్నాలు వేయించారు. బోనాలతో నైవేద్యం సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ జూనియర్ అసిస్టెంట్ ముద్దసాని కుమారస్వామి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పేదలకు ఉచిత న్యాయ సేవలు

- జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్



మాట్లాడుతున్న జడ్జి దుర్గం గణేశ్

సుల్తానాబాద్‌రూరల్: గ్రామస్తులకు ఉచిత న్యాయ సాయం అందిస్తామని మున్సిఫ్ కోర్టు జడ్జి దుర్గం గణేశ్ తెలిపారు. చట్టాలపై అవగాహన కలిగించడానికే న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. కనుకుల గ్రామంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో జడ్జి మాట్లాడారు. కుటుంబ తగాదాలు, ఆస్తి గొడవలు, ఇతర చిన్న కేసుల పరిష్కారం కోసం న్యాయ సేవాధికార సంస్థను సంప్రదిస్తే ఉచితంగా సాయం అందిస్తారని తెలిపారు. కార్మికులు తప్పనిసరిగా బీమా సౌకర్యం చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పడాల శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి జోగుల రమేశ్, ఏజీపీ అవుల లక్ష్మీరాజం, లోక్ అదాలత్ సభ్యుడు శ్రీనివాస్‌రావు, న్యాయవాదులు తిరుపతిరెడ్డి, సర్వోత్తంరెడ్డి, శంకరయ్య, పంచాయతీ కార్యదర్శి రాధ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాలు



మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష, చిత్రంలో సిమ్స్ ప్రిన్సిపాల్ హిమబిందు సింగ్ తదితరులు

పెద్దపల్లిరూరల్: పల్లెల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచి నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం అధికారులతో తన కార్యాలయంలో సమావేశమయ్యారు. అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతు, టాయిలెట్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి కావాలన్నారు. పీహెచ్‌సీలు, సబ్ సెంటర్ల పనులు గడువులోగా పూర్తికావాలని తెలిపారు. టెండర్ దశలోని 18 సబ్ సెంటర్ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన పనులు చివరి దశలో ఉన్నాయని, వాటిని వారంలోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అదనపు కలెక్టర్ అరుణశ్రీ, సీపీవో రవీందర్, ఈఈ గిరీశ్‌బాబు పాల్గొన్నారు.

ప్రీ స్కూల్ నిర్వహణపై నిరంతర తనిఖీలు

అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ నిర్వహణపై సూపర్‌వైజర్లు నిరంతరం తనిఖీ చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. కలెక్టరేట్‌లో సంక్షేమ శాఖ, ఐసీడీఎస్ పనితీరుపై సమీక్షించారు. బరువు, ఎత్తు తక్కువ ఉన్న పిల్లలను గుర్తించి బాలామృతం తదితర పోషక విలువలున్న ఆహారాన్ని అందించాలని సూచించారు. జిల్లా సంక్షేమ అధికారి రవుఫ్‌ఖాన్, సీడీపీవో కవిత తదితరులు ఉన్నారు.

సిమ్స్‌లో పీజీ కోర్సులు

కోల్‌సిటీ(రామగుండం): సింగరేణి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(సిమ్స్)లో పీజీ కోర్సులు ప్రారంభించాలని, ఆ దిశగా జాతీయ మెడికల్ కౌన్సిల్ నుంచి అనుమతుల సాధనకు పటిష్ట కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. గోదావరిఖనిలోని సిమ్స్‌లో ఆస్పత్రి నిర్వహణపై బుధవారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పీజీ కోర్సులకు అవసరమైన మార్పులు, అనుమతుల విషయంలో ఎదురయ్యే సవాళ్లు, ఫ్యాకల్టీ, క్లినికల్ మెటీరియల్, మౌలిక వసతుల కల్పనపై చర్చించారు. పీజీ కోర్సుల ఏర్పాటుకు జిల్లా వైద్యారోగ్య శాఖ, వైద్య విధాన పరిషత్ సహకారం అందించాలని సూచించారు. సిమ్స్ ఆస్పత్రిలో వైద్య సిబ్బంది వ్యవహరించే తీరు తదితర అంశాలపై కలెక్టర్ పలు సూచనలు చేశారు. ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి ప్రమోద్‌కుమార్, జిల్లా ఆస్పత్రుల సూపరింటెండెంట్ శ్రీధర్, జీజీహెచ్ సూపరింటెండెంట్ దయాల్‌సింగ్ పాల్గొన్నారు.

పకడ్బందీగా భూముల సర్వే

ధర్మారం(ధర్మపురి): ప్రభుత్వ భూముల సర్వే పకడ్బందీగా ఉండాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. స్థానిక తహసీల్దార్, ఎంపీడీవో, ఏపీఎం కార్యాలయాలను బుధవారం కలెక్టర్ సందర్శించారు. సర్వే తీరుపై అధికారులతో సమీక్షించారు. తహసీల్దార్ కార్యాలయంలో చేపట్టిన మరమ్మతులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఖిలావనపర్తిలోని ప్రభుత్వ భూముల సర్వేను శనివారంలోగా పూర్తి చేయాలని, ఆ తర్వాత బొమ్మారెడ్డిపల్లిలో సర్వే చేపట్టాలని సూచించారు. కోర్టు కేసులు, ధరణి పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. ధర్మారం పీహెచ్‌సీ సొంత భవన నిర్మాణానికి అవసరమైన స్థల పరిశీలన చేశారు. పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య, తహసీల్దార్ మహమ్మద్ ఆరిఫ్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఎంపీవో రమేశ్, ఏపీఎం తులసీమాత, ఏపీవో రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా 8 పోలింగ్ కేంద్రాలు

- అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

పెద్దపల్లిరూరల్: జిల్లాలో కొత్తగా 8 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో పోలింగ్ కేంద్రాల పనితీరుపై సమీక్షించారు. పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒకటి, రామగుండంలో మూడు, మంథనిలో నాలుగింటికి ప్రతిపాదించినట్లు ఆయన వివరించారు. అలాగే మరో ఆరు పోలింగ్ కేంద్రాలను మార్చినట్లు పేర్కొన్నారు. రామగుండం, మంథని నియోజకవర్గాల పరిధిలో మూడేసి పోలింగ్ కేంద్రాల మార్పునకు ప్రతిపాదించినట్లు తెలిపారు. కొత్త ఓటరు నమోదు దరఖాస్తులను నవంబర్ 28 వరకు స్వీకరిస్తామని అన్నారు. నాయకులు సంపత్‌రావు, శశిభూషణ్ కాచే, రవీందర్, ఉప్పు రాజ్‌కుమార్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

సింగరేణి భూ సేకరణపై సమీక్ష

సింగరేణికి అవసరమైన భూసేకరణలో ఇబ్బందులుంటే దరఖాస్తు చేయాలని అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ సూచించారు. రామగిరి మండలం బుధవారంపేట రైతులతో ఆయన సమీక్షించారు. బుధవారంపేటలో 88.20 ఎకరాలు సేకరిస్తున్నామని తెలిపారు. అవార్డు ఎంక్వైరీ పీఎన్‌డీపీ సమయంలో రైతుల వివరాల్లో పొరపాట్లు దొర్లితే దరఖాస్తు ఇవ్వాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ తిరుపతి, సింగరేణి అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సకాలంలో రైస్ డెలివరీ చేయాలి

పెండింగ్ రైస్‌ను సకాలంలో డెలివరీ చేయాలని అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్ మిల్లర్లకు సూచించారు. రైస్‌మిల్లర్లు, అధికారులతో ఆయన తన కార్యాలయంలో సమీక్షించారు. రైస్ డెలివరీలో నిర్లక్ష్యం చేసే మిల్లుల్లో తనిఖీలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో రాజేందర్, డీఎం శ్రీకాంత్‌రెడ్డి, రైస్‌మిల్లర్లు పాల్గొన్నారు.

రామేశ్వరాలయం సందర్శన



గర్భగుడిని పరిశీలిస్తున్న స్థపతి

రామగుండం: అంతర్గాం మండలం రాయదండి శ్రీబిలుకల రామేశ్వరాలయాన్ని దేవాదాయ, ధర్మాదాయశాఖ స్థపతి, ఎండోమెంట్ అధికారులు బుధవారం సందర్శించారు. ఆలయ పునరుద్ధరణలో భాగంగా ప్రహరీ, రాజగోపురం, ప్రవేశద్వారానికి ఆర్చీ నిర్మాణం, గర్భగుడిలో వర్షపు నీరు లీకేజీ తదితర పనులు చేపట్టాల్సి ఉందని నిర్ణయించారు. ఇందుకోసం రూ.50 లక్షలు అవసరమని అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు అధికారులు తెలిపారు. ఆలయ పూజారి మాణిక్యం కుమార్, గ్రామస్తులు మేడి ఓదెలు, సాదుల సదానందం, కూనారపు సురేశ్ పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేయాలి



నూతన ఉపాధ్యాయులతో సురేశ్


మంథని: కొత్తగా వృత్తిలోకి వచ్చిన ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ, నిబద్ధతతో పనిచేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కర్రు సురేశ్ కోరారు. డీఎస్సీ–2024 ద్వారా ఉద్యోగంలో చేరిన పలువురు ఉపాధ్యాయులకు ఉద్యోగ, వృత్తి సంబంధ అంశాలపై బుధవారం అవగాహన కల్పించారు. విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చే గురుతర బాధ్యతను చేపడుతున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. పీఆర్టీయూ మండల అధ్యక్షుడు దొంతుల కుమార్, ప్రధాన కార్యదర్శి ఎర్రం రమేశ్, కార్యదర్శి ఏగోళపు శ్రీకాంత్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎగ్గడి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

21న పోలీసు అమరవీరుల సంస్మరణ

- రామగుండం సీపీ శ్రీనివాస్



గోదావరిఖని: కమిషనరేట్ పరిధిలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని రామగుండం పోలీస్‌కమిషనర్ శ్రీనివాస్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో ఆన్‌లైన్ ద్వారా వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈనెల 21 – 31వ తేదీ వరకు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. ఓపెన్‌హౌస్ ద్వారా పోలీసు విధులు, ఆయుధాల వినియోగం, సాంకేతికత, ప్రజారక్షణలో పోలీసుల సేవలు, ప్రతిభ, త్యాగాలు ప్రజలకు తెలియజేయడం, ఆన్‌లైన్‌లో వ్యాసరచన పోటీలు, రక్తదాన శిబిరాల నిర్వహణ, సైకిల్ ర్యాలీ నిర్వహించనున్నామని పేర్కొన్నారు. షార్ట్ ఫిలిమ్స్, ఫొటోగ్రఫీ పోటీలతో పాటు పదిరోజుల పాటు పోలీస్ కళాబృందంతో కళాజాత చేపట్టనున్నామన్నారు. ఈనెల 21న పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణదినం నిర్వహిస్తున్నట్లు సీపీ వెల్లడించారు.







అద్యంతం.. ఉత్కంఠ భరితం

గోదావరిఖని: సింగరేణి స్థాయి మైన్స్ రెస్క్యూ పోటీలు బుధవారం ఆర్జీ–2 ఏరియాలోని మెయిన్ రెస్క్యూ స్టేషన్‌లో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మొత్తం ఆరు జట్లు పోటీల్లో పాల్గొంటున్నాయి. రెండురోజుల పాటు పోటీలు జరుగుతాయి. తొలిరోజు జీడీకే–7ఎల్‌ఈపీ గనిలో రెస్క్యూ రికవరీ పోటీలు నిర్వహించారు. స్టాట్యుటరీ, థియరీ, ఫ్రెష్ ఎయిర్ బేస్, ఫస్ట్ ఎయిడ్ పోటీలు మెయిన్ రెస్క్యూ స్టేషన్‌లో జరిగాయి. డీడీఎంఎస్ అధికారులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరిస్తున్నారు.

క్లుప్తంగా

బైక్ ఢీకొని వ్యక్తి మృతి


పెద్ద అంజయ్య (ఫైల్)

కథలాపూర్(వేములవాడ): మండలంలోని సిరికొండకు చెందిన చెట్పెల్లి పెద్ద అంజయ్య(56) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఎస్సై నవీన్ కుమార్ వివరాల ప్రకారం.. పెద్ద అంజయ్య సిరికొండలో సెలూన్ నిర్వహిస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం టీ తాగేందుకు హోటల్‌కు వెళ్తుండగా వేగంగా వస్తున్న వస్తున్న బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు కుటుంబసభ్యులు కరీంనగర్ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడి కుమారుడు హరీశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గోరింటాలకు చెందిన ఒకరు..

గంభీరావుపేట(సిరిసిల్ల): రోడ్డు ప్రమాదంలో ఓవ్యక్తి మృతిచెందాడని ఎస్సై శివకుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గంభీరావుపేట మండలంలోని గోరింటాలకు చెందిన బందెల రాజయ్య(56) మంగళవారం సాయంత్రం కూలీ పని ముగించుకొని, సైకిల్‌పై ఇంటికి వెళ్తున్నాడు. మూలపల్లె స్టేజీ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజయ్య తీవ్రంగా గాయపడి, అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యులు బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుండెపోటుతో చిన్నారి..


శ్రీయాన్వి (ఫైల్)

జమ్మికుంట(హుజూరాబాద్): ఆడిపాడే వయసులోనే ఆ చిన్నారికి నూరేళ్లు నిండాయి. గుండెపోటుతో నాలుగేళ్ల పాప మృతిచెందిన ఘటన జమ్మికుంటలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని పంగిడిపల్లికి చెందిన మేడిపల్లి రాజు–జమున దంపతులు బతుకుదెరువు కోసం జమ్మికుంట పట్టణానికి వచ్చారు. రాజు స్థానికంగా ఓ ఫైనాన్స్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ దంపతులకు ఒక పాప శ్రీయాన్వి(4), బాబు ఉన్నారు. శ్రీయాన్వి మంగళవారం కళ్లు తిరుగుతున్నాయని చెప్పి, తీవ్ర అస్వస్థతకు గురైంది. తల్లిదండ్రులు హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్న సమయంలో గుండెపోటు రావడంతో చనిపోయింది. పాప పుట్టిన సమయంలోనే గుండె సంబంధిత సమస్యలు ఉన్నాయని, అప్పుడు గమనించకపోవడం వల్లే పరిస్థితి విషమించి, మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..


నర్సయ్య (ఫైల్)

బోయినపల్లి(చొప్పదండి): సంతానం కలగడం లేదని ఆత్మహత్యాయత్నం చేసిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై పృథ్వీధర్ వివరాల ప్రకారం.. బోయినపల్లి మండలంలోని మల్కాపూర్‌కు చెందిన బోడ నర్సయ్య (50) గొర్రెల కాపరి. అతనికి 18 ఏళ్ల క్రితం వివాహం కాగా, సంతానం కలగలేదు. దీంతో తరచూ మనోవేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో భార్య దసరా పండుగకు పుట్టింటికి వెళ్లింది. ఈ నెల 15న ఉదయం నర్సయ్య క్రిమిసంహారక మందు తాగాడు. అతని సోదరుడి కుమారుడు రాకేశ్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం చనిపోయాడు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఫీజు బకాయిలు రూ. 150 కోట్లు


జిల్లా కేంద్రంలో మూసి ఉంచిన ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాల

- ఎండమావిగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు
- మూతపడ్డ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు
- బీసీ సంక్షేమశాఖలో రూ.113.39 కోట్లు పెండింగ్
- ఎస్‌యూ పరిధిలో 64 డిగ్రీ, 35 పీజీ కళాశాలలు
- 52,663 మందికిపైగా విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరం


జగిత్యాలలో బుధవారం సుప్మా ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న కళాశాలల యాజమాన్యాలు

కరీంనగర్: ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల చెల్లింపుల్లో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న జాప్యంతో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ.150కోట్ల బకాయిల కోసం యాజమాన్యాలు ఆందోళనకు దిగుతున్నాయి. కళాశాలలను బంద్‌చేసి రోడ్డెక్కుతున్నారు. ఫీజు చెల్లించాల్సిందేనంటూ విద్యార్థులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. శాతవాహన యూనివర్సిటీ పరిధిలో 64 డిగ్రీ, 35 పీజీ ప్రైవేటు కళాశాలలు ఉన్నాయి. 52,663 మంది విద్యార్థులు చదువుతున్నారు. మూడేళ్ల నుంచి ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల కాకపోవడంతో బకాయిలు కొండెక్కి కూర్చున్నాయి. ఒక్క బీసీ సంక్షేమశాఖకు సంబంధించిన బకాయిలు 2021–22, 2022–23, 2023–24 సంవత్సరాలకు సంబంధించినవే రూ.113.39 కోట్లు రావాల్సి ఉంది. దీంతో బిల్లులు చెల్లించాలని ఆందోళనకు దిగుతున్నారు.

చెల్లింపులకు మోక్షమెప్పుడో...

2021–22, 2022–23, 2023–24 విద్యా సంవత్సరాలకు సంబంధించి బీసీ విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్ (ఆర్‌టీఎఫ్), స్కాలర్‌షిప్ (ఎంటీఎఫ్) కింద జిల్లాకు రూ.113 కోట్ల 39 లక్షల బకాయిలు రావాల్సి ఉంది. బీసీ సంక్షేమశాఖలో మూడేళ్లలో ఎంటీఎఫ్ కింద 34,102 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారికి మొత్తంగా రూ.3కోట్ల 34 లక్షల 65 వేల బకాయిలు రావాల్సి ఉంది. ఈబీసీ కేటగిరీలో ఆర్టీఎఫ్ కింద మూడేళ్లల్లో 3,755 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి రూ.96 కోట్ల 35 లక్షల 50వేలు రావాల్సి ఉంది. ఈబీసీ ఆర్‌టీఎఫ్ కింద రూ.13 కోట్ల 69 లక్షల 59 వేలు రావాల్సి ఉంది. 150 కోట్ల నుంచి బీసీ విద్యార్థులకు సంబంధించి 113 కోట్ల 39 లక్షలు పోను మిగితా 37 కోట్లు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు సంబంధించిన స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉండటం గమనార్హం.

సర్టిఫికెట్లు ఇవ్వకుండా కొర్రీలు

స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగుతున్నాయి. పరీక్షలు సమీపిస్తుండడంతో కళాశాల యాజమాన్యాలు విద్యార్థులను ఫీజుల పేరిట వేధింపులకు గురిచేస్తున్నాయి. ప్రశాంత వాతావరణలో పరీక్షలకు సన్నద్ధం కావాల్సిన తరుణంలో ఫీజు ఒత్తిడి మానసికంగా గందరగోళానికి గురి చేస్తోంది. చదువు పూర్తిచేసుకున్న విద్యార్థులకు టీసీలు, ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వడానికి పలు కళాశాలల యాజమాన్యాలు నిరాకరిస్తున్నాయి. ఒరిజినల్ సర్టిఫికెట్ల కోసం కళాశాలకు వెళ్లి అడిగితే ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు అందలేదని, ఆ నిధులు వచ్చాకే సర్టిఫికెట్లు ఇస్తామని కొర్రీ పెడుతున్నారు. లేదంటే ఫీజు చెల్లించి సర్టిఫికెట్లు తీసుకెళ్లాలని సలహా ఇస్తున్నారు.

మిస్డ్ కాల్‌తో ఓటు నమోదు చేసుకోండి

- పట్టభద్రులకు హెల్ప్‌లైన్ 92400 21444
- అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నరేందర్ రెడ్డి తదితరులు

కొత్తపల్లి/కరీంనగర్: పట్టభద్రులు 92400 21444 హెల్ప్‌లైన్ నంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చి, ఓటు నమోదు చేసుకోవాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి కోరారు. బుధవారం కరీంనగర్‌లోని అల్ఫోర్స్ విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో మిస్డ్ కాల్ క్యాంపెయిన్ పోస్టర్ ఆవిష్కరించారు. పట్టభద్రుల ఓటు నమోదుకు సహకరించేందుకు 50 మంది సిబ్బంది అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఒక కలర్ ఫోటోతోపాటు ఒరిజినల్ డిగ్రీ మెమోను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. తనను ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాల్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపిస్తే రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలలకు పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్ డీఏలు మంజూరయ్యేలా చూస్తానన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులకు ప్రత్యేక యాప్ రూపొందించి, 6 నెలలపాటు ఉచితంగా శిక్షణ ఇప్పిస్తానని తెలిపారు. ఉమ్మడి నాలుగు జిల్లాల్లో యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేస్తానని పేర్కొన్నారు. వివిధ కళాశాలల కరస్పాండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో సత్తా



కరీంనగర్‌రూరల్: రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా రెజ్లర్లు సత్తా చాటారు. హైదరాబాద్‌లో మంగళ, బుధవారాల్లో జరిగిన ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్–19 రెజ్లింగ్ పోటీల్లో మూడు రజత, ఆరు కాంస్య పతకాలు సాధించారు. రుక్మాపూర్ సైనిక్ పాఠశాలకు చెందిన పి.విజయ్‌కుమార్, టి.సిద్ధార్థలు రజత, బి.నర్సింహ, కె.రాజరథన్, ఎస్.దినేశ్‌లు కాంస్య పతకాలు గెలిచారు. ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ జూనియర్ కళాశాలకు చెందిన కె.రాజు రజత, కె.అజయ్ కాంస్య, అల్ఫోర్స్ జూనియర్ కళాశాలకు చెందిన వి.రఘుచరణ్ కాంస్య, ట్రినిటీ జూనియర్ కళాశాలకు చెందిన సీహెచ్.ఆదిత్య మహరాజ్ కాంస్య పతకాలు సాధించినట్లు టీం కోచ్ ఎం.వంశీకృష్ణ తెలిపారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో నిలిచిన యూరియా ఉత్పత్తి

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంలోని ఆర్‌ఎఫ్‌సీఎల్ కర్మాగారంలో యూరియా ఉత్పత్తి నిలిచిపోయింది. ప్లాంట్ యూరియా ఉత్పత్తి సామర్థ్యం రోజూ 3,850 మెట్రిక్ టన్నులు, అమ్మోనియా 2,200 మెట్రిక్ టన్నులు. అయితే, వార్షిక మరమ్మతుల కారణంగా గత గురువారం రాత్రి ప్లాంట్‌ను షట్‌డౌన్ చేశారు. అమ్మోనియా పైప్‌లైన్ మరమ్మత్ చేయడానికి 20 రోజుల సమయం పడుతుందని అధికారులు అంచనా వేశారు. తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో యూరియాకు డిమాండ్ అధికంగా ఉంది. ఈ సమయంలో ఉత్పత్తి నిలిపివేయడంతో సర్వత్రా ఆందోళన నెలకొంది.

అమ్మోనియా లీక్‌తో సమస్యలు..

అమ్మోనియా పైప్‌లైన్ లీకేజీ సమస్యతో ఉత్పత్తికి ఆటంకం కలుగుతోంది. ఈనెల 9న సీఎండీ శరవణన్ ప్లాంట్‌లో పర్యటించారు. కాగా, కర్మాగారంలో సెప్టెంబర్ 6న అమ్మోనియా పైప్‌లైన్ లీక్ కావడంతో ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది.

6 నెలల్లో 6,17,600.43 మెట్రిక్ టన్నులు..

ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో గత 6 నెలల్లో యూరియా ఉత్పత్తి భారీగా పెరిగింది. 2024–25 ఆర్థిక సంవత్సరం 01 ఏప్రిల్ 2024 నుంచి 30 సెప్టెంబర్ 2024 వరకు 6,17,600.43 మెట్రిక్ టన్నుల నీమ్‌కోటెడ్ యూరియాను ఉత్పత్తి చేశారు. దీన్ని తెలంగాణతోపాటు ఆరు రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నారు.

అంతర్జాతీయ స్థాయిలో పడిపోతున్న ప్రతిభ


బ్రిగేడియర్ల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి

- సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి ఆందోళన
- సంస్థ స్థాయి రెస్క్యూ పోటీలు ప్రారంభం

గోదావరిఖని(రామగుండం): జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్న సింగరేణి రెస్క్యూ జట్లు అంతర్జాతీయ స్థాయిలో రాణించడం లేదని, ఇందుకు గల కారణాలను విశ్లేషించాలని సింగరేణి ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. గోదావరిఖనిలో బుధవారం ప్రారంభమైన రెండురోజుల జోనల్ స్థాయి మైన్స్ రెస్క్యూ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డీఎంఎస్ ఉమేశ్ ఎం.సావర్కర్ పోటీలు ప్రారంభించారు. ఈసందర్భంగా వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, అంతర్జాతీయ పోటీలకు అనుగుణంగా జోనల్‌స్థాయిలో టాస్క్‌లు ఇవ్వాలని జడ్జిలకు సూచించారు. గతానుభవాలను దృష్టిలో పెట్టుకుని భవిష్యత్‌లో చేపట్టే పోటీల్లో సింగరేణి సత్తా చాటాలని అన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన జట్లను కోలిండియా స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్పొరేట్ సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్, ఆర్జీ–1, 2 జీఎంలు లలిత్‌కుమార్, ఎల్వీ సూర్యనారాయణ, రెస్క్యూ జీఎం శ్రీనివాస్ రెడ్డి, ఎక్స్‌ప్లోజివ్స్ జీఎం ఖైద్యా, యూనియన్ నాయకులు వైవీరావు, ధర్మపురి, రెస్క్యూ సూపరింటెండెంట్ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

చదివిన బడిలోకే సారుగా..

- కొత్త టీచర్లలో పలువురికి దక్కిన అవకాశం
- ఆనందం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

‘ఏళ్లుగా కష్టపడి చదివారు.. ప్రభుత్వ ఉద్యోగం సాధించేవరకు పట్టు వదల్లేదు.. చివరకు టీచర్, పీడీ కొలువులు సాధించారు.. కొలువు కోసం నిర్వహించిన పరీక్షలో విజయం సాధించడం ఒక ఎత్తయితే.. తాము చదువుకున్న బడిలోకే సారుగా వెళ్లడం వారి సంతోషాన్ని రెట్టింపు చేసింది. చిన్నప్పుడు ఆడిపాడి, అల్లరి చేసిన తమ పాఠశాలకు బుధవారం ఉద్యోగులుగా వెళ్లిన పీడీ రమేశ్, టీచర్లు వేణుకుమార్, రాజు ఆనందం వ్యక్తం చేశారు.’

ఆడుకున్న స్థలంలో అడుగుపెట్టా



రాయికల్(జగిత్యాల): నేను చదువుకుంటూ, ఆడిపాడిన పాఠశాలలోనే పీడీగా ఉద్యోగం సాధించడం సంతోషంగా ఉంది. ఆడుకున్న స్థలంలో అడుగుపెట్టడం ఒక క్రీడాకారుడిగా, పూర్వ విద్యార్థిగా గర్వంగా ఉంది. రాయికల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 3 నుంచి 5వ తరగతి వరకు, జెడ్పీహెచ్‌ఎస్‌లో 6 నుంచి 8వ తరగతి వరకు, కట్లకుంట జెడ్పీహెచ్‌ఎస్‌లో 9, 10వ తరగతులు, మేడిపల్లి గురుకులంలో ఇంటర్మీడియట్ చదివాను. చదువుకున్న రాయికల్ హైస్కూల్‌లోనే నేను పీడీగా ఉద్యోగం సాధించడం చెప్పలేని అనుభూతినిస్తోంది. విద్యార్థులను మంచి క్రీడాకారులుగా తయారు చేసేందుకు నావంతు ప్రయత్నం చేస్తా.

– పురైె రమేశ్ పీడీ, రాయికల్ హైస్కూల్

కలలో కూడా ఊహించలేదు



రుద్రంగి(వేములవాడ): మాది రుద్రంగి మండల కేంద్రం. నేను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనే 6 నుంచి 10వ తరగతి వరకు చదువుకున్నాను. విద్యాబుద్ధులు నేర్పిన బడిలో టీచర్‌గా చేరడం చెప్పలేని ఆనందాన్నిస్తోంది. ఇది నేను కలలో కూడా ఊహించలేదు. విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు బోధిస్తూ, వారు క్రమశిక్షణతో మెలిగేలా చూస్తా. సమాజంలో మంచి పౌరులుగా ఎదిగేందుకు, మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యేందుకు నా వంతు కృషి చేస్తా.

– వేణుకుమార్, టీచర్, జెడ్పీ హైస్కూల్, రుద్రంగి

చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తొస్తున్నాయి



గంభీరావుపేట(సిరిసిల్ల): మాది గంభీరావుపేట. నేను స్వగ్రామంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోనే చదువుకున్నాను. ఇప్పుడు ఇదే బడిలో స్కూల్ అసిస్టెంట్(ఇంగ్లిష్)గా ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది. పాఠశాలలో ఉంటే నా చిన్ననాటి జ్ఞాపకాలు, నాకు చదువు చెప్పిన సార్లు గుర్తొస్తున్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తా.

– శనిగరపు రాజు, టీచర్, జెడ్పీ బాలుర హైస్కూల్, గంభీరావుపేట


విధుల్లో చేరిన 12 మంది టీచర్లు


జాయినింగ్ ఆర్డర్ ఇస్తున్న ఎంఈవో లక్ష్మి

మంథని: డీఎస్సీ–2024లో ఎంపికైన 12 మంది(పది మంది స్కూల్ అసిస్టెంట్లు, ఇద్దరు ఎస్జీటీలు) కొత్త టీచర్లు మంథని మండలంలో తమకు కేటాయించిన పాఠశాలల్లో బుధవారం విధుల్లో చేరారు. తొలుత వారికి ఎంఈవో లక్ష్మి, ఆరెంద కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీలత జాయినింగ్ ఆర్డర్ అందజేశారు. సీఆర్పీ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ స్టేజీ–2లో కదలిక

- పీసీబీకి వివరాలు అందజేసిన ఎన్టీపీసీ
- డిసెంబర్‌లో ప్రజాభిప్రాయ సేకరణ?


ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టు ముఖ ద్వారం

జ్యోతినగర్(రామగుండం): రామగుండంలోని ఎన్టీపీసీ ప్రాంతంలో తెలంగాణ స్టేజీ–2 విద్యుత్ ఉత్పత్తి కేంద్రం పనులు ప్రారంభించేందుకు మార్గం సుగమమైంది. దీనికింద చేపట్టే 2,400 (ఒక్కోటి 800 మెగావాట్లు గల మూడు యూనిట్లు) మెగవాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టు పూర్తి వివరాలతో కూడిన డాక్యుమెంట్లను ఎన్టీపీసీ టీటీఎస్‌లోని కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు బుధవారం అందజేశారు. రామగుండం పాత యాష్ పాండ్ ఏరియాలో స్టేజీ–2 ప్లాంట్ నిర్మాణం కోసం సుమారు 606 ఎకరాలు ఇప్పటికే సేకరించారు. వచ్చే డిసెంబర్‌లో దీనికి సంబంధించిన ప్రజాభిప్రాయ సేకరణ చేపడతారని అధికారులు వివరించారు. తెలంగాణ పునర్విభజన చట్టంలో 4,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టు నిర్మించాలనేది నిబంధన. ఇందులో భాగంగా స్టేజీ–1లో ఇప్పటికే 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంగల రెండు యూనిట్లు నిర్మించారు.

భూగర్భ గనుల్లో ఐదేళ్ల అనుభవం

- యువకార్మికులకు తప్పనిసరి
- సింగరేణిలో నిబంధనల మార్పు!


సింగరేణి యువ కార్మికులు

గోదావరిఖని: సింగరేణిలోని యువ కార్మికులు ఇకనుంచి భూగర్భగనిలో ఐదేళ్లపాటు పనిచేయాల్సిందేనా? విధుల్లో చేరగానే అండర్‌గ్రౌండ్‌లో విధులు నిర్వర్తించాల్సిందేనని మెలిక పెడుతున్నట్లు సమాచారం. ఈమేరకు నిబంధనలు మార్చేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఈమేరకు సంస్థ సీఎండీ బలరాం అధికారులకు దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. యువకార్మికుల విషయంలో యాజమాన్యం ఇకనుంచి కఠినంగా వ్యవహరిస్తుందని సమాచారం. బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనపై జీఎంలతో ఇటీవల సమీక్షించిన సీఎండీ.. తాజా వ్యాఖ్యలు చేయడంతో యువకార్మికుల్లో ఆందోళన ప్రారంభమైంది. వీరితోపాటు మహిళా కార్మికులు కూడా భూగర్భగనుల్లో పనిచేయాల్సిందేనని అంటున్నారు. త్వరలో దీనిపై మార్గదర్శకాలు విడుదల చేయనున్నట్లు చెబుతున్నారు.

సింగరేణిలో 15 వేల మంది యువ కార్మికులు..

సంస్థలో సుమారు 15వేల మంది యువ కార్మికులు ఉన్నారు. మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన వారిస్థానంలో వారిపిల్లలకు ఉద్యోగాలు కల్పిస్తున్నారు. ఉద్యోగాల్లో చేరిన చాలా మందిలో ఉన్నత విద్య అభ్యసించిన వారే ఉన్నారు. విద్యార్హతలకు సమానస్థాయిలో ఉద్యోగాలు కావాలనే పట్టుదలతో వారు ఉన్నారు. లేనిపక్షంలో పక్షంలో కనీసం ఉపరితల పనులు ఇవ్వాలని కోరుతున్నారు. ఈక్రమంలో అండర్‌గ్రౌండ్(భూగర్భ)గనుల్లో పనిచేసేవారి సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని యాజమాన్యం పేర్కొంటోంది. అయితే ప్రతీ అంశానికి భూగర్భగనిలో పనిచేసిన అనుభవం తప్పనిసరి కావడంతో యువకార్మికులను అందులో విధులు నిర్వహించాల్సిందేనని నిర్ణయించినట్లు సమాచారం.

పెరిగిన రాజకీయ జోక్యం..

సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిపోవడంతో చాలామంది కార్మికులు విధుల్లో చేరీచేరగానే లైట్ జాబ్‌లవైపు దృష్టి సారిస్తున్నట్లు చెబుతున్నారు. గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాలతోపాటు రాష్ట్రంలోని అధికారం కాంగ్రెస్, దేశంలోని బీజేపీ ప్రజాప్రతినిధులు సింగరేణి అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. దీంతో చాలామంది భూగర్భగనుల్లోకి వెళ్లకుండా డిపార్ట్‌మెంట్లు, ఓసీపీల్లో విధులు కల్పించాలని ఒత్తిడి తీసుకొస్తున్నట్లు యాజమాన్యం గుర్తించింది.

గైర్హాజర్ కార్మికులపై సీరియస్

యువకార్మికుల్లో చాలామంది విధులకు గైర్హాజర్ అవుతున్నారనే విషయాన్ని యాజమాన్యం గుర్తించింది. దీనిపై వివరాలు సేకరించిన అధికారులు.. ఇప్పటికే గైర్హాజర్ కార్మికులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఏడాదిలో వంద మస్టర్ల కన్నా తక్కువ ఉన్న కార్మికులపై ఫోకస్ పెట్టారు. ఈక్రమంలో గైర్హాజర్ కార్మికుల వివరాల సేకరిస్తున్నారు. డ్యూటీలు చేయని వారిని విధుల్లోంచి తొలగించాలని సీఎండీ ఆదేశాలు జారీచేయడంతో గైర్హాజర్ కార్మికుల భవిష్యత్ అగమ్యగోచరంగా మారే పరిస్థితి నెలకొంది.

మహిళా కార్మికులకు అండర్‌గ్రౌండ్ డ్యూటీ

సంస్థలో మహిళా కార్మికుల సంఖ్య పెరిగింది. అయితే ఇప్పటివరకు మహిళా కార్మికులు డిపార్ట్‌మెంట్లు, జీఎం కార్యాలయాలు, గని ఉపరితలాలపై పనిచేస్తున్నారు. ఇకనుంచి వారిని కూడా భూగర్భ గనుల్లోకి పంపించాలనే యోచనలో యాజమాన్యం ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన విధి విధానాలను ఖరారు చేస్తున్నట్లు చెబుతున్నారు. కోలిండియాలో మహిళా కార్మికులు పనిచేస్తున్న క్రమంలో సింగరేణిలో కూడా వారి సేవలను భూగర్భగనుల్లో వినియోగించుకోవాలని చూస్తున్నారు.

భూగర్భ గనిలో పని చేయాల్సిందే..



కొత్తగా ఉద్యోగాల్లో చేరిన యువ ఉద్యోగులు ఐదేళ్లు అండర్‌గ్రౌండ్‌లో పనిచేయాల్సిందే. భూగర్భగనుల్లో అనుభవం ఉన్న సీనియర్ కార్మికులు ఉద్యోగవిరమణ పొందారు. వారిస్థానంలో పనిచేసేవారు తగ్గిపోతున్నారు. దీంతో భూగర్భగనుల్లో కార్మికుల సంఖ్య తగ్గింది. ఆ లోటు భర్తీ చేసేందుకు జూనియర్లకు విధులు కేటాయిస్తాం. అలాగే మహిళా కార్మికులను కూడా భూగర్భగనుల్లో విధులు కేటాయించేలా ఆలోచన చేస్తున్నాం.

– బలరాం, సింగరేణి సీఎండీ